www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 7 నవంబర్ 2025

8న జిల్లా సమీక్షా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు ఈ నెల 8న జిల్లా సమీక్షా కమిటీ సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమీక్షా కమిటీ సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన సమాచారంతో సన్నద్ధం కావాలన్నారు. గత డిఆర్‌సి సమావేశంలో ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అడిగిన ప్రశ్నలపై తీసుకున్న చర్యల నివేదికను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఇటీవల మొంథా తుపాను ప్రభావం, వివిధ రంగాలలో నష్టం, వాటి అంచనాల రూపకల్పన, అభివృద్ధి, సంక్షేమం తదితర అంశాలపై పూర్తి స్థాయి సమాచారంతో సమావేశానికి సిద్ధం కావాలన్నారు.

నిలిచిన బరకాల సరఫరా

- తడుస్తున్న పంటలు..రైతులకు తప్పని నష్టాలు
- రాయితీపై కూటమి ప్రభుత్వం బరకాలు ఇవ్వాలని కోరుతున్న రైతులు

బరకాలు లేక వర్షాలకు తడిచిన ధాన్యం(ఫైల్)

ప్రజాశక్తి - రాజోలు

జిల్లాల్లో ఆయకట్టు దిగువన ఉన్న సముద్ర తీరంలోనే కాకుండా ఎగువన ఉన్న బ్యారేజ్ సమీపంలోని పంట పొలాలు సైతం ఎటా ముంపు బారిన పడుతున్నాయి. దీనివల్ల ఖరీఫ్ సాగు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది జిల్లాలో 1,69,000 ఎకరాల్లో సార్వా సాగు జరుగుతుందని అంచనా. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు సంభవించినప్పుడు కాపాడుకునేందుకు గతంలో ప్రభుత్వం రాయితీపై బరకాలు అందజేసేంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని నిలుపుదల చేసింది. దీంతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. గత ఐదేళ్లుగా వర్షాలు కురిశాయి. పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం, మిరప, మొక్కజొన్న, మినుములు, కందులు తడిసిపోకుండా కాపాడుకోవడానికి రైతులు అవస్థ పడాల్సి వచ్చింది. తమ వద్దనున్న పాత, చినిగిపోయిన బరకాలు కప్పి రక్షణ కల్పించేందుకు ఎంత ప్రయత్నించినా ఉపయోగం లేకపోయింది. ధాన్యం తడిసిపోయి తీవ్రంగా నష్టపోయారు. మరికొందరు అద్దెకు బరకాలు దొరకుతా యేమోనని పరుగులు పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. బరకాలు లేక పంటలు నష్టపో యామని, ధాన్యం, తడిసిపోయి రంగు మారిందని రైతులు విలవిల్లాడారు.

రాయితీ లేకపోవడం.. రైతుపై భారం..!

పంట దిగుబడులు చేతికొచ్చే దశలో వర్షాలు పడితే ఈ పట్టలకు విపరీతమైన డిమాండు ఉంటుంది. దీనిని గుర్తించిన గత ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసేది. వైసిపి అధికారంలోకి వచ్చాక రాయితీ పట్టలకు మంగళం పాడింది. దీంతో రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.ప్రభుత్వం రాయితీ మీద పంపిణీ చేయకపోవడంతో తయారీదారులు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కర్షకులు అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గత టిడిపి ప్రభుత్వం హయాంలో నాణ్యమైన బరకాల ధర రూ.2,400 ఉండేది రాయితీతో రూ.800కే రైతులకు అందించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాయితీ పట్టలు పంపిణీ చేయలేదు. ఆపథకానికి మంగళం పాడేసింది. ప్రస్తుతం మార్కెట్లో బరకాల నాణ్యత తక్కువగా ఉండేవి రూ.2 వేల నుంచి రూ.2,500 ఉండగా, నాణ్యమైన బరకం రూ.3 వేలు ధర పలుకుతోంది. నాణ్యమైన బరకం కొనుగోలు చేయాలంటే రైతుకు భారంగా మారింది. ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తే రైతుపై భారం తగ్గుతుంది.

రైతుకు ఎంతో అవసరం..!

తుపానులు, ఖరీఫ్, రబీ సీజన్లో పంట ఉత్పత్తులను ఆరుబయట ఉంచినప్పుడు వర్షం, మంచు నుంచి కాపాడుకోవడానికి ప్రతి రైతుకూ బరకాలు అవసరం. వాయుగుండాలు ఏర్పడినప్పుడు పంట చేజారిపోకుండా బరకాలు ద్వారా కాపాడుకుంటారు. అనుకోకుండా వచ్చే వర్షాల సమయంలో పంట ఉత్పత్తులు ఆరబెట్టే ప్రాంతంలోనే పట్టలు సిద్ధంగా ఉంచుకుంటారు. ఇంత కీలకమైన పట్టలను ప్రభుత్వం రాయితీపై అందించి ఆదుకోవాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా గత ప్రభుత్వం ఐదేళ్లుగా రైతులకు బరకాలను పంపిణీ చేయకుండా వారిపై అదనపు భారం పడేలా చేసింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్ చివరి రోజుల్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి. కళ్లాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు తడిసిపోతున్నాయి. రాత్రి వేళ బరకాలు కప్పి పగటి వేళ తొలగిస్తుంటారు. దీని వల్ల మంచు, వర్షం నుంచి కాపాడుకొంటారు.

పంటల నూర్పిడి తరువాత..

పంటల నూర్పిడి తరువాత ధాన్యం ఆరబెట్టుకునే సమయంలో వర్షాలు వస్తే నష్టపోకుండా బరకాలు కాపాడతాయని రైతులు తెలిపారు. గతంలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను 50 శాతం రాయితీపై అందించేవారు. చిన్న రైతులకు ఎక్కువగా ఉపయోగపడే టార్పాలిన్ల మార్కెట్ ధర రూ.2,500 ఉంటే వాటిని రూ.1,250కే ఇచ్చేవారు. ఏటా మండలానికి 300 నుంచి 350 వరకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం బరకాల పంపిణీకి స్వస్తి పలకడంతో రైతులు మార్కెట్లో రూ.3,500 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. అంత డబ్బులు పెట్టి కొనలేని రైతులు సిమెంట్, ఎరువుల సంచులతో తయారు చేసిన బరకాలను కొని సరిపెట్టుకుంటున్నారు.

ప్రభుత్వం పంపిణీ చేయాలి

జిల్లాలో వరి, మొక్కజొన్న, కూరగాయ పంటలకు ఎక్కుగా రసాయనాలు పిచికారీ చేయాల్సి ఉంది. దీంతో స్ప్రేయర్ల వినియోగం తప్పనిసరి. సొంతంగా వాటిని కొనుగోలు చేయలేని రైతులు కొంతమంది అద్దెకు తెచ్చుకొని వినియోగిస్తున్నారు. గతంలో 50 శాతం రాయితీపై రైతులకు యంత్ర పరికరాలను అందించేవారు. పిచికారీ యంత్రాల రాయితీ పథకానికి సైతం మంగళం పలకటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం తైవాన్ స్ప్రేయర్ల ధర బహిరంగ మార్కెట్లో సుమారు రూ.25 వేల వరకు ఉంది. అంత పెద్ద మొత్తంలో వెచ్చింలేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా చొరవచూపి తైవాన్ స్ప్రేయర్లు, ఇతర వ్యవసాయ యంత్ర పరికరాలు, బరకాలను పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

క్వాయర్ పరిశ్రమల స్థాపనకు సదస్సు

మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు గురువారం క్వాయర్ బోర్డు ఆధ్వర్యం లో క్వాయర్ పరిశ్రమల స్థాపనకై ప్రాంతీయ సదస్సు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాయర్ బోర్డ్ జిల్లా పరిశ్రమలు కేంద్రం చేయూతతో కొబ్బరి క్వాయర్ ఉత్పత్తుల తయారీ ఒక విలువైన అగ్రో-ఆధారిత పరిశ్రమగా ఉందని, ఎంఎస్ఎంఇ అమలులో భాగంగా ఒక జిల్లా ఒక ఉత్పత్తికి నానుడితో పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానికంగా లక్ష ఎకరాలలో కొబ్బరి సాగు కొనసాగుతోందని కేవలం కొబ్బరి కాయలు మాత్రమే విక్రయిస్తున్నారన్నారు. ఇప్పటివరకు స్థానికంగా క్వాయర్ ఆధారిత పరిశ్రమలకు సంబంధించి ఎటువంటి పరిశ్రమలు పెద్దగా స్థాపించలేదన్నారు. కొబ్బరి డొక్కల నుండి లభించే ఫైబర్ పౌడర్‌ని ఉపయోగించి అనేక రకాల ఉత్పత్తులు తయారు చేసే ప్రక్రియగా జాతీయ సంపదగా అటు పరోక్షంగా ఉపాధి అవకాశాలు ఇటు పారిశ్రామిక వేత్తలకు ఆదాయం లభిస్తుందన్నారు. స్థానికంగా క్వాయర్ జియో టెక్స్టైల్స్ పరిశ్రమకు మంచి డిమాండ్ ఉందన్నారు. కేవలం స్థానికంగా కొబ్బరి తాళ్లు, కోకో పిట్ తయారు చేసే పరిశ్రమలు మాత్రమే అంతంత మాత్రమే ఉన్నా యన్నారు. దేశవ్యాప్తంగా 5 శాతం రోడ్ల నిర్మాణంలో మాత్రమే జియో టెక్స్టైల్ మ్యాట్లు వినియోగిస్తున్నార న్నారు. కొబ్బరి డొక్కల నుండి పలు రకాల ఉత్పత్తులను కేరళ తదితర రాష్ట్రాలలో రూపొందించి ఎగుమతి చేస్తున్నారని అదే తరహాలో స్థానికంగా ఎంఎస్ఎంఇ పార్కులు క్లస్టర్ల లో ఈ యొక్క పరిశ్రమలు యూ నిట్లు స్థాపించి ఉపాధి అవకాశాలు కల్పనకు శాఖలు సమన్వయం వహించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్త లను ప్రోత్సహించా లన్నారు. క్వాయర్ జియో టెక్స్టైల్స్ రోడ్లు, కాలు గట్లు, మట్టి సారాలకు వినియోగిం చడం ద్వారా మన్నిక పెరుగుతుం దన్నారు..కొబ్బరి క్వా యర్ ఉత్పత్తుల తయారీ ప్రధానంగా ప్రస్తుతం రెండు లేయర్లు మాత్రమే జరుగుతోందన్నారు. ఇంకా బహుళ ప్రయోజనాలు కలిగిన ఉత్పత్తులను తయారు చేసేందుకు సన్నద్ధం కావాలని రైతులకు కలెక్టర్ సూచించారు. ఈ నెలాఖరులోగా కేరళ రాష్ట్రంలో కొబ్బరి బై ప్రొడక్ట్స్ తయారీ పరిశ్రమల సందర్శనకై ఎక్స్పోజర్ విజిట్ నిర్వహించి అధ్యయనం చేయడం జరుగుతు ందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సురేష్ కుమార్, సీనియర్ సైంటిస్ట్ రాజా, ప్రాంతీయ సంచాలకులు సుభాష్, పవన్ కుమార్, విజయ్‌కుమార్, ఉద్యాన అధికారి బివి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన

బంకు ఏర్పాటుకు అధికార బృందం స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

పోలీస్ శాఖకు సంబంధించిన ఇండియన్ ఆయిల్ కంపెనీ పెట్రోల్ బంక్ ఆలమూరు పోలీస్‌స్టేషన్‌కు మంజూరు అయ్యిందని ఎస్ఐ జి.నరేష్ గురువారం తెలిపారు. దీనికి సంబంధించి పోలీసుస్టేషను పక్కన ఉన్న శిథిలమైన పోలీసు క్వార్టర్స్ ఉన్నాయి. వీటి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో ఈ బంకును ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పెట్రోల్ బంక్ నిర్మించడానికి స్థల పరిశీలన చేశారు. దీనికోసం పోలీస్ శాఖ ఎఆర్ డిఎస్‌పి సుబ్బరాజు, రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ జి.నరేష్, ఇండియన్ ఆయిల్ కంపెనీ ప్రతినిధుల బృందంతో కలిసి గురువారం స్థల నిర్ధారణ చేశారు. ఇప్పటివరకు రాజమహేంద్రవరం, కాకినాడ నగర పరిధిలోనే ఈ పోలీసు వారి పెట్రోల్ బంకులు ఉన్నాయన్నారు. ఈ జిల్లాలో తొలి బంక్‌ను ఆలమూరులో ఏర్పాటు చేయడంపై ఇప్పటికే వినియోగదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారని పలువురు తెలిపినట్లు ఎస్ఐ నరేష్ అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇందుపల్లి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఇందుపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని పి. అనూష రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లంక రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9వ తరగతి చదువుతున్న అనూష రావులపాలెం లో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి నెట్ బాల్ పోటీల్లో విజేతగా నిలిచిందని అన్నారు. ఈ నెల 8,9,10 తేదీలలో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ విజయవాడ పటమట లో జరిగే రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలో అనూష పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాలిని అప్పాజీ, ఉప సర్పంచ్ హనుమాన్ బుజ్జి, ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు, పిఇటి బుజ్జి అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వల్లూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం వ్యాసరచన, చిత్రలేఖనం, పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం చిట్టూరి శ్రీధర్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కపిలేశ్వరపురం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు వందేమాతరం 150 ఆకారంలో కూర్చుని జాతీయ గీతం ప్రాముఖ్యతను తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంగా శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కార్టూ'నిజం'



చేనేత కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

నిత్యావసరాలు అందజేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మొంథా తుపాను నేపథ్యంలో ఇబ్బందులకు గురైన చేనేత కార్మికులకు గురువారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు బియ్యం నిత్యవసర సరుకులు అందజేశారు అంగర శ్రీ గణపతి చేనేత సహకార సంఘం, నేలటూరు చేనేత సహకార సంఘాల వద్ద నిర్వహించిన కార్యక్రమాంలో ఆయన మాట్లాడారు. అనంతరం చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు ఎంఎల్ఎ వేగుళ్ల అందజేశారు. తహాశీల్దార్ జి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని 672 మంది చేనేత కార్మికులకు బియ్యం, నిత్యావసరాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో పిఎసిఎస్ ఛైర్మన్ పుత్సల శ్రీనివాస్, టిడిపి నాయకులు గుడిమెట్ల సత్య నారాయణ, తాళ్ళ గంగాధరరావు, డి.నాగ బాబు, పిల్లా బసవరాజు, దానేటి శరత్, ఎంఎస్ఒ పద్మ, ఆర్ ఐ అజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో బంద్ విజయవంతం

- రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని జెఎసి డిమాండ్

పట్టణంలో బంద్ నిర్వహిస్తున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని అఖిల పక్ష కమిటీ పిలుపుమేరకు గురువారం బంద్ విజయవంతమైంది. బంద్‌కు రామచంద్ర పురం చాంబర్స్ ఆఫ్ కామర్స్ వర్తక, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు, రవాణాసంస్థలు, బార్ అసోసియేషన్ పూర్తి మద్దతు తెలిపారు. రాజగోపాల్ సెంటర్ వద్ద నుండి ఎల్ఐసి ఆఫీస్ వరకు వాకర్స్, ప్రజాసంఘాలు, అఖిల పక్ష (జెఎసి) నాయకులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తక, వాణిజ్య, విద్యాసంస్థలు, షాపు లు స్వచ్ఛందంగా మూసివేశారు. అమలాపురం వద్దు, కాకినాడ ముద్దు అంటూ నాయకులు నినాదాలు చేశారు. ఈ బంద్‌ను ఉద్దేశించి రామచంద్రపురం నియోజక వర్గ అఖిలపక్ష కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో-కన్వీనర్ బత్తుల సిద్ధూ మాట్లా డుతూ కాకినాడ జిల్లాలో కలపాలంటూ ప్రజల ఆకాంక్షను మూడు నెలలుగా ఉద్యమ రూపంలో తెలియజేస్తూ అనేక మంది నాయకులకు అధికారులకు వినతిపత్రాలు అందించామని వివరించారు. ఉప సంఘం త్వరలో నివేదిక సిఎంకు ఇచ్చి కొత్త జిల్లాలు, నియోజక వర్గాలు ప్రకటించిందని, ఈ బంద్ ద్వారా రామచంద్ర పురం నియోజక వర్గ ప్రజలు ప్రభుత్వానికి తమ హెచ్చరిక తెలియజేశారన్నారు. కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని నిర్ణయంపై సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తారని నాయకులు ఆశా భావం వ్యక్తం చేశారు. లేని పక్షంలో ఇప్పటికే కాకినాడ జిల్లాకు అనుకూలంగా 52 గ్రామ పంచా యతీలు, రామచంద్రపురం మున్సిపాలిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని కాకినాడ జిల్లాలో కలిపే విషయంలో మంచి నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. ఈ సంపూర్ణ బంద్‌కు తమ మద్దతు ప్రకటించిన రామచంద్రపురం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కొవ్వూరి తాతారెడ్డి, అధ్యక్షులు పసుపులేటి సత్తిబాబు, ప్రయివేటు విద్యాసంస్థల అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జివి.రావు, బార్ అసోసియేషన్, ఆటో, టాక్సీ ఆటో, రెస్టారెంట్ అండ్ హోటల్ అసోసియేషన్ వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమొక్రసీ నాయకులు చీకట్లో వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు రాము, జనసేన టిడిపి పట్టణ అధ్యక్షులు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దొమ్మలపాటి సత్యనారాయణ, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భీమ శంకరం, సిపిఐ నాయకులు శారద, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుత్తుల వీరన్న శెట్టి, ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి, పిడిఎస్‌యు నాయకులు కె.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

దాతలకు విఘ్నేశ్వరుని చిత్రపటం అందిస్తున్న ఆలయ అర్చకులు

ప్రజాశక్తి - అయినవిల్లి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విగ్నేశ్వర స్వామిని గురువారం సఖినేటిపల్లి మండలం ఉయ్యూరు వారి మెరక గ్రామానికి చెందిన చింత ఉమామహేశ్వరరావు, సావిత్రి , వారి కుటుంబ సభ్యులు దర్శించికుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి నిత్యాన్న దాననిధికి రూ.1,00,116 విరాళంగా ఇచ్చి నట్లు ఆలయ ఇఒ సతీష్ రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సదస్సులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యానందరావు

ప్రజాశక్తి - రావులపాలెం

మహిళలు, యువత పరిశ్రమల స్థాపనలో ముందడుగు వేసి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో గురువారం జరిగిన ఎంఎస్ఎంఇ అవగాహనా సదస్సు లో ముఖ్య అతిథిగా డిఆర్‌డిఎ పీడీ సాయి నాథ్ జయచంద్ర, ఇండస్ట్రియల్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ, ఫిషరీస్ ఎడి వర్ధన్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ జోనల్ మేనేజర్ శ్రీనివాస్, నాబార్డ్ బ్యాంక్ మేనేజర్ స్వామి నాయుడు, ఎంపిడిఒ చాగంటి సుబ్రహ్మణ్యం, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని కొబ్బరి, అరటి, చేపల ఉత్పత్తుల ఆధారిత అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల బాబ్జీ, మైగాపుల గురయ్యానాయుడు, కొప్పిశెట్టి ప్రసాద్, కేతా శ్రీను, మాసాబత్తుల ఆనందరావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో వైసిపి కోటి సంతకాల సేకరణ

సంతకాలు సేకరిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మామిడికుదురు

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైయివేటీకరణను ఆపాలని కోరుతూ మాకన్నపాలెం, బి.దొడ్డవరం, పెదపట్నం లంక గ్రామాలలో వైసిపి గ్రామ శాఖ అధ్యక్షులు చెల్లింగి రామకృష్ణ, గోగి గోపాలకృష్ణ, రాయుడు ఆనంద్‌ల అధ్యక్షతన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము ఆధ్వర్యంలో గురువారంకోటి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వైసిపి పి.గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కూటమి ప్రభుత్వం దెబ్బతీ స్తుందని విమర్శించారు. మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వము వైద్య రంగాన్ని సువర్ణ అధ్యాయంగా తీర్చిదిద్దగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని నీరుకారుస్తూ ప్రజలకు ఆరోగ్య భద్రత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాముల దేవి ప్రకాష్, కాండ్రేగుల మహాలక్ష్మి, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, జోగిరామకృష్ణ, మట్టపర్తి శివ, గెద్దం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రవికుమార్ నిరవధిక దీక్ష

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఆర్‌టిసి బస్టాండ్‌ను పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమెల్లి రవి కుమార్ చేపట్టిన నిరవధిక దీక్షను బుధవారం పోలీసులు భగ్నం చేసి ముమ్మిడివరం కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించార. అయితే రవికుమార్ ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం బుధవారం సాయంత్రం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ రవికుమార్ నిరవధిక దీక్ష యథా విధిగా కొనసాగిస్తున్నారు దీక్ష కొన సాగిస్తున్న రవికుమార్‌కు ఆరోగ్యంపై అభిమా నులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బస్టాండ్‌ను పునరుద్ధరించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చే వరకు నిరవధిక దీక్షను కొనసాగిస్తానని రవికుమార్ స్పష్టం చేశారు. రవి కుమార్‌కు సామాజిక కార్యకర్త జనిపల్లి సంధ్యారాణి, బిమవరపు సూర్య, పొత్తుల సుందరం సంఘీభావం తెలిపారు.

చెక్ పోస్టుల పరిశీలన

భట్నవిల్లి చెక్ పోస్టులను పరిశీలిస్తున్న చిట్టిబాబు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండలంలోని భట్నవిల్లి, నడిపూడి చెక్ పోస్టులను వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి మోహన్ రావుతో కలిసి ఎఎంసి వైస్ ఛైర్మన్ పరమట చిట్టిబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి చెక్ పోస్టుల ద్వారా వచ్చే ఆదాయం పక్కదారి పట్టకుండా చూడాలని, ఆదాయాన్ని ప్రభుత్వానికి సక్రమంగా అందజేయాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. రోజువారీ వివిధ రకాల కొబ్బరి, వరి, రొయ్య పన్ను వసూలు చెక్ పోస్టులు వద్ద సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని ఆరా తీశారు. దీనితో పాటు రశీదులు తనిఖీ చేశారు.

సాయం అందిస్తున్న ఎంపిడిఒ జి.సరోవర్

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని కొండుకుదురు గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. అతని కుటుంబాన్ని అయినవిల్లి ఎంపిడిఒ జి. సరోవర్ పరామర్శించి అయినవిల్లి ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది తరపున రూ.26 వేల సాయాన్ని అందజేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకునేందుకు అన్ని విధాల సహకరిస్తామని వారికి భరోసా ఇచ్చి ఉన్నారు. అలాగే మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ భార్యకు పింఛను మంజూరు చేయటానికి మరియు వారి పిల్లల చదువులకు అగు ఖర్చు కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా మంజూరు చేయించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండుకుదురు సర్పంచ్ మేడిది ప్రసాద్ మరియు ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ లు గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సు సుమను సత్కరిస్తున్న ఎంపిపి

సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - మామిడికుదురు

విధి నిర్వహణలో పనిచేసే ఉద్యోగులకు వారు అందించిన సేవలతోనే ప్రజల్లో ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని ఎంపిపి కుసుమ వనజ కుమారి పేర్కొన్నారు. మొందా తుపాను ఫైటర్ అవార్డు అందుకున్న నగరం పిహెచ్‌సి స్టాఫ్ నర్సు యల్లమెల్లి సుమను గురువారం ఘనంగా సత్కరించారు. ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో పిహెచ్‌సికి వచ్చిన గర్భిణికి ప్రసవం చేసి తల్లి, బిడ్డలను క్షేమముగా పంపించారంటూ స్టాఫ్ నర్సును వైద్యాధికారి డాక్టర్ జాన్‌లెవీతో పాటు ఉద్యోగులు అభినందించారు ఈ విధంగా సేవలు చేయడం వల్లే ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు పెరుగుతాయన్నారు ఈ కార్యక్రమంలో నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి, బొంతు మణి రాజు, జా లెం సుబ్బారావు, మట్ట సత్తిబాబు, సూపర్‌వైజర్ బళ్ళ నరసింహారావు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- ఏదైనా కిలో 100కు పైగానే ధర పలుకుతోంది
- కొనలేని పరిస్థితులలో సామాన్యులు

కూరగాయల దుకాణం

ప్రజాశక్తి - మామిడికుదురు

మొంథా తుపాను కారణంగా కూరగాయల ధరలు కొండెక్కాయని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లంక గ్రామాల్లో ఎక్కువగా కూరగాయలు సాగు చేస్తుంటారు జూలై నుంచి ఆగస్టు, సెప్టెంబర్ వరకు వరదలు వదలకుండా రావడంతో కూరగాయల పంటకు తీరని నష్టం వాటిల్లింది ఇప్పుడిప్పుడే కొత్తగా సాగు చేపట్టిన నేపథ్యంలో ముందా తుపాను, భారీ వర్షాల ప్రభావంతో కూరగాయల పంటకు తీరని నష్టం వాటిల్లింది మార్కెట్ కు సరిపడా సరుకు రాకపోవడంతో ఆ ప్రభావం ధరలపై పడిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

పంటలు దెబ్బ తినడంతో తగ్గిన ఉత్పత్తి

ప్రస్తుతం కార్తీక మాసం నెలకావడంతో అయ్యప్ప, వెంకటేశ్వర స్వామి, భవాని మాలదారులు దీక్షల తో మాంసాహార వినియోగం తగ్గి కూరగాయల వినియోగం అధికం కావడం, దానికి తోడు పెళ్లిళ్ల ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో వినియోగంమరింత ఎక్కువగా పెరిగింది

సామాన్యులకు అందని ధరలు

కూరగాయలు ఏ రకం కొనాలన్న కేజీ రూ.100పై బడి ధర పలుకుతోంది. దీంతో సామాన్యులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. తుపాను ముందు ఉన్న ధరలకు ప్రస్తుతం రెట్టింపుధర పెరగడంతో తామేమి కొనలేమంటూ జనం ఆందోళన చెందుతున్నారు. ఏ కూరగాయ ధర చూసిన వంద రూపాయలకు తక్కువగా లేకపోవడంతో వెయ్యి రూపాయలు ఉంటే కానీ వారానికి సరిపడా కూరగాయలు రావడంలేదని మధ్యతరగతి కుటుంబాలు ఆవేదన చెందుతున్నారు. ఇక ఉమ్మడి కుటుంబాల పరిస్థితి చెప్పనవసరం లేదు ప్రతీ రోజూ కూరగాయలకు రూ.100 పైబడి ఖర్చు చేయాల్సి వస్తే తమ పరిస్థితి ఏంటని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క నిత్యావసర సరుకుల ధరలు పెరిగి భారంగా మారడంతో మరో పక్క కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి పోవడంతో పేదల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది.

ధరల పెరుగుదలతో తగ్గిన కొనుగోలు

ఏ కూరగాయలు చూసినా కిలో రూ.100 పైగా ధర పలుకుతుండడంతో రోజు రోజుకీ కిలో కూరగాయల వాడే మధ్యతరగతి కుటుంబాలు అరకిలోతో సరి పెట్టుకునే పరిస్థితులు నెలకొన్నాయి ఆకుకూరల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. మామిడికాయ ధర కాయ గతంలో రూ.10లు ఉండగా ప్రస్తుతం రూ.20, ములగకాయ రూ.20 ధర పలుకుతోంది.

నేరాలు ఘోరాలు

తండ్రిని గొంతు కోసి చంపిన కొడుకు

ప్రజాశక్తి-రాజానగరం

చెల్లెలి పెళ్లి విషయమై తండ్రితో వివాదం ఏర్పడడంతో ఆవేశంతో కుమారుడు తండ్రి తలను గోడకేసి కొట్టడమే కాక గొంతు కోసి హత్య చేసిన సంఘటన రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని తొర్రేడులో గురువారం జరిగింది. రాజానగరం సిఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపిన వివరాలివి. వడిశెల అప్పారావు (49) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పారావుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. చిన్న కుమార్తెకు సంబంధాలు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వచ్చిన ఒక పెళ్లి సంబంధం వారు రూ.రెండు లక్షలు నగదు కావాలని అడగడంతో అంత సొమ్ము తాను ఇవ్వలేనని అప్పారావు వెనకడుగు వేశారు. ఈ విషయమై కుమారుడికి, తండ్రికి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. బుధవారం అర్ధరాత్రి దాటే వరకు ఈ విషయమై తండ్రి కొడుకుల మధ్య మరోసారి వివాదం చెలరేగింది. దీంతో ఆవేశానికి లోనైన సాయికుమార్ తండ్రి అప్పారావు తలను గోడకేసి కొట్టాడు అడ్డుకోబోయిన తల్లి వెంకటలక్ష్మి, సోదరి ప్రశాంతిని గదిలోకి నెట్టి తలుపు గొళ్లెం పెట్టాడు. ఆవేశం చల్లారకపోవడంతో సాయికుమార్ చాకుతో తండ్రి పీకను కోసి హత్య చేసాడని సిఐ వీరయ్యగౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వికె.రాయపురం గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పిఠాపురం మండలం గోవిందరాజుపాలెం నుంచి మోటార్ సైకిల్‌పై కాకినాడ పని నిమిత్తం వెళ్తున్న సిరిసిపల్లి గొల్లబ్బాయి (80)ని వెనుక నుంచి లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జంతువుల కొవ్వు స్వాధీనం

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని మాధవనగర్లోని ఓ ఇంట్లో నిల్వ చేసినన జంతువుల కొవ్వును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జంతువుల కొవ్వును నిల్వ చేసినట్లు అధికారులకు వచ్చిన ఫిర్యాదుపై గురువారం ఎస్ఐ వి.మణికుమార్, పారిశుద్ధ్య అధికారి పి.ప్రభాకర్ అప్పారావు, ఆర్ఐ వెంకటేష్ ఆ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో 21 డబ్బాల్లో నిల్వ చేసిన కొవ్వును గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిచామని, మిగిలిన జంతు కొవ్వును పారిశుద్ధ్య కార్మికులతో భూమిలో పూడ్చి పెడతామని అన్నారు. భవన యజమాని యిమ్మిడిశెట్టి మణికంఠపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

పురుగుమందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జీవితంపై విరక్తితో పురుగు మందు తాగిన మండలంలోని సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన దువ్వాపు జయరాం (25) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. తల్లిదండ్రులు లేక, ఒంటరితనం భరించలేక, అతడు పురుగు మందు తాగినట్టు తెలుస్తోందన్నారు. అతడి మేనమామ నందమూరు బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌టిసి బస్సుకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -దేవరపల్లి

రాజమహేంద్రవరం నుంచి ఏలూరు వైపు వెళుతున్న ఆర్‌టిసి పల్లె వెలుగు బస్సు దేవరపల్లి బస్టాండ్‌కు చేరుకునే సమయానికి బస్సు ఇంజిన్ బాయిలర్ అకస్మాత్తుగా వేడెక్కి ఆయిల్ లీకయ్యింది. వెంటనే అప్రమత్తమైన ఆర్‌టిసి సిబ్బంది బస్సులో ఉన్న ప్రయాణికులను తక్షణమే దించారు. ఆ సమయంలో బస్సు ప్రయాణికులతో నిండిపోయి ఉండటంతో ప్రయాణికులందరూ బస్సులో నుంచి హుటాహుటిన బయటకు పరుగులు తీశారు. ఎవరికీ ఎలాంటి గాయాలు అవలేదు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌సిఎం ప్రాంగణంలో సిఐటియు మండల మహాసభ జరిగింది. మండల గౌరవ అధ్యక్షులు చంద్రమళ్ళ పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కార్మికులను కారు చౌకగా పెట్టుబడుదారులకు బానిసలుగా మార్చుతుందన్నారు. ఎందరో ప్రాణత్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని పక్కన పెట్టి నేడు రోజుకు 10 గంటలకు కార్మికులు పని చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం చేయడం పెట్టుబడుదారులకు అడుగులకు మడుగులు వత్తడమేరనని అనానరు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళలకు భద్రతే లేని ఈ రోజుల్లో నైట్ షిఫ్ట్‌లు అనుమతి ఇవ్వడం దారుణమన్నారు. పని గంటలు పెంచుతూ నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు పెంచాలనే ఆలోచన లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. అనంతరం సిఐటియు కన్వీనింగ్ కమిటీ నియమించారు. నూతన కన్వీనర్‌గా ఓరిగంటి నందీశ్వరుడు, కో కన్వీనర్లుగా తులసి, సత్యవతి, వెంకటలక్ష్మి, ఇందిరతోపాటు, మరో 16 మందితో కమిటీని ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది. ఈ మహాసభలో సిఐటియు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ద్వారా గురువారం పట్టణంలో 100 మందికి ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్య ప్రజలకు షుగర్, బిపి, హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ మదీనా, అధ్యాపకులు పాల్గొన్నారు.

భట్నవిల్లిలో బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న తారక్

తుపాను బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

మొంథా తుపాను బాధితులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన నిత్యవసర సరుకులను అమలా పురం మండలం భట్నవిల్లి టిడిపి ప్రధాన కార్యదర్శి నామడి తారక్ ఆధ్వర్యంలో గురువారం పంపిణి చేశారు. బాధితులకు నిత్యావసరాలను అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు, ఎంఎల్ఎ ఆనందరావుకు ప్రజలు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నామడి తారక్ మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సరిపెళ్ల సుబ్బరాజు, మండళిక బాబీ, కాట్రూ శ్రీనివాస్, పెంటా సుబ్రహ్మణ్యం, నేదునూరి బాలయ్య, పుణ్య మంతుల రమేష్, జల్లి బాబ్జి, నామడి రమేష్, కాట్రూ సత్యనారాయణ, అతుకూరి ప్రసాద్, తొత్తారముడి సత్యనారాయణ, దాకారపు సుందరరావు, మల్లవరపు రాంబాబు, ఇళ్ల రాంబాబు, నేలపూడి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎంఎల్ఎ వేగుళ్ల పరామర్శ

ప్రజాశక్తి - మండపేట, కపిలేశ్వరపురం

మండపేట నియోజకవర్గంలోని రాయవరం, కపిలేశ్వరపురం మండలాలలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల మరణించిన రాయవరం మండలం మాచవరం లో బీరక సీతా రత్నం కుటుంబ సభ్యులను, వెంటూరులో చిరట్ల శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులను, కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలో ఆచంట మహాలక్ష్మి, చోడిశెట్టి పేరయ్య నాయుడు, సుంకర గంగాలక్ష్మి కుటుంబ సభ్యులను, అంగర లో మేరేటి సీతారామ స్వామి, వాసా సత్తిబాబు కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు . ఆయన రాయవరం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి మాధవరావు, రిమ్మలపూడి వేణుగోపాలదొర, మేడపాటి రవీంద్రరెడ్డి, సబ్బెళ్ళ వెంకన్నబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

దాతల సాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - ఆలమూరు

మంచానికే పరిమితమైన గోవిందు

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి దాతల కోసం ఎదురుచూస్తున్నాడు. వివరాలు ఇవి.. చెముడులంక గ్రామానికి చెందిన కుందేటి గోవిందు, భార్య గాయత్రి దంపతులకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. గోవిందు రజక సామాజిక వర్గానికి చెందినప్పటికీ వృత్తిరీత్యా వడ్రంగి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఒక ఏడాది క్రితం గోవిందు అనారోగ్యానికి గురయ్యాడు. వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆసుపత్రిలో చేరాడు. అక్కడ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యులు రెండు కిడ్నీలకు ఇన్ఫెక్షన్ కలిగిందని వైద్యం చేసి, ఆరోగ్యశ్రీ పథకంలో డబ్బులు పూర్తిగా తీసేసుకున్నారు. కానీ గోవిందుకు మెరుగవలేదు. దీంతో తన దగ్గర ఉన్న ఆర్థిక స్తోమతతో రాజమహేంద్రవరం లోని ప్రయివేటు ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకున్నప్పటికీ ఆరోగ్య పరిస్థితి మెరుగు పడలేదు. అతనికి కిడ్నీల మార్పిడితో పాటుగా మెరుగైన వైద్యానికి హైదరాబాద్ ఆసుపత్రిలో చేరవలసిందిగా వైద్యులు సూచించారు. గోవిందు పరిస్థితిని అతని అన్నయ్య శ్రీను విలేకరులకు గురువారం తెలియజేశారు. దాతలు స్పందించి ఆర్థిక సాయాన్ని అందజేసి ఆదుకోవాలని గోవిందు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఆర్థిక సాయం చేయదలచిన దాతలు 7013830420 నెంబర్ కి కాల్ చేసి సాయం అందించవచ్చని, పై నెంబర్ కి ఫోన్ పే కూడా ఉందని గోవిందు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్‌కు గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

బైక్ పై వెళ్తూ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో మాజీ కౌన్సిలర్ కు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నగర పంచాయతీ మాజీ కౌన్సిలర్, ప్రయివేటు మెడికల్ ప్రాక్టీషనర్ జనపల్లి రమేష్ బాబు బుధవారం రాత్రి అమలాపురం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా నగర పంచాయతి పరిధిలోని స్థానిక మూలతూము సమీపంలో కుక్క అడ్డురావడంతో ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన రమేష్ ను అమలాపురం లోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఈ విధమైన సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

తుపాను సాయం పంపిణీపై బాధితుల నిరసన

ప్రజాశక్తి-మామిడికుదురు

మొందా తుపాను సాయం పంపిణీలో పేదలకు అన్యాయం జరిగిందంటూ మొగలికుదురులో గురువారం బాధితులు నిరసన తెలిపారు. పక్కా భవనాలలో ఉన్న వారికి నిత్యావసరసరుకులతో పాటు ఆర్థిక సహాయం అందించి పేదలను విస్మరించిన అధికారుల తీరుపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. చేనేత కార్మికు లకు 50 కిలోలు ప్రకటించగా 25 కిలోల వంతున మాత్రమే పంపిణీ చేశారన్నారు. ఇక్కడ పరిహారం పంపిణీలో తేడాలు జరిగాయని పరిశీలన చేసి ఇబ్బందులు పడ్డ నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన లో చిర్ర సత్యనారాయణ, చుట్టగుల్ల సత్యవతి, సెట్టెం పార్వతి, ఉల్లంపర్తి పుణ్యవతి, మట్టపర్తి నాగమణి తదితరులు పాల్గొన్నారు .

సోమేశ్వరరావుకు సర్వేపల్లి జాతీయ అవార్డు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కార్యాలయాధికారిగా సేవలందిస్తున్న అంతర్జాల పక్ష పత్రికల సంపాదకుడు జి.సోమేశ్వరరావుకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డుకు ఎంపికయ్యారు. చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ ఫౌండేషన్ ప్రతీ ఏడాది అందిస్తున్న అవార్డుల్లో భాగంగా ఈ ఏడాది సోమేశ్వరరావుకు ఎంపిక చేసిందని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమేశ్వరరావుకు యూనివర్సిటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో.వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎస్. రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ రవితంగజన్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, అభినందనలు తెలిపారు.

ఆలయ అధికారులు స్వాధీనం చేసుకున్న దేవస్థానం భూమి

కోర్టు తీర్పుతో భూమి స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పనిచేసే వంట నౌకరికి ఇచ్చిన భూమిని ఆలయ అధికారులు గురువారం హైకోర్టు మరియు సిసిఎల్ఎ తీర్పుతో స్వాధీనం చేసుకున్నట్లు ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్ రావు తెలిపారు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాడపల్లి గ్రామంలో 27/2 సర్వే నెంబరులో 2.60 ఎకరాల భూమి, 48/4 ఎ సర్వే నెంబరులో 4.61 ఎకరాల భూమిని గతంలో వంట నౌకరి నిమిత్తం ఇచ్చామన్నారు. అయితే ఆ వ్యక్తులు వంట నౌకరీ సరిగ్గా చేయనందున సిసిఎల్‌సి వారి ఉత్తర్వుల మేరకు తిరిగి భూములను దేవస్థానం స్వాధీనం చేసుకుందన్నారు. హైకోర్టు మరియు సిసిఎల్ఎ తీర్పు నిమిత్తం ఈ భూములు స్వాధీనం చేసుకున్నట్లు దేవస్థాన డిసి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ వి.సత్యనారాయణ, మండల రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో యూరియా

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని రైతులకు సకాలంలో యూరియాను పంపిణీ చేయాలని నల్లజర్ల మండల వ్యవసాయ అధికారి బి.సోమశేఖర్ హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సూచించారు. వ్యవసాయ కార్యాలయంలో గురువారం అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టం వివరాలు అంచనా రిపోర్టులు, హార్టికల్చర్ ఏరియాలో ఇ క్రాప్ పెండింగ్ పూర్తి చేయాలని యాంత్రీకరణ, యూరియా పంపిణీ, పంటల వివరాలు నమోదు యంత్ర పరికరాల యాప్ అప్‌డేట్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలుపై దృష్టి పెట్టాలన్నారు. రైతుల వద్ద ధాన్యం సేకరించి రైస్ మిల్లులకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం, యూరియా పంపిణీ విషయంలో రైతులకు తగు సలహాలు సూచనలు అందించాలని, రైతుల రిజిస్ట్రేషన్ల పెండింగ్ పూర్తి చేయాలని అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి పుష్పలత మండలంలోని అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


ఆధునిక మిషన్లు అందజేస్తున్న ఇసుజు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ తదితరులు

పాలిటెక్నిక్ విద్యార్థులకు మిషన్ల అందజేత

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇసుజు కంపెనీ ప్రతినిధులు రూ.20 లక్షల విలువైన మిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం ఇసుజి కంపెనీ ప్రతినిధులను అభినందించారు. విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణలతోనే ఉన్నతమైన భవిష్యత్తు సాధ్యమని సత్యం వ్యాఖ్యానించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనలతో ఇసుజు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ శంకర్ శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఓనో సుంగ్ (జపాన్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద సమకూర్చిన మూడు అధునాతన ఆరు మిషన్లను బట్లపాలెం, ముక్తేశ్వరం, ద్రాక్షారామం పాలిటెక్నిక్ కళాశాలలకు అందజేశారని వివరించారు. రామచంద్రపురం ఉపాధి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇసుజు ప్రతినిధులు, ఉపాధి కార్యాలయం సిఇఒ రామ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం జరిగింది. చదువుకుంటున్న విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ తో పాటు, వారి ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇప్పటివరకు 29 జాబ్ మేళాలు నిర్వహించామన్నారు. ఇసుజు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ శంకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా మంత్రి సుభాష్ సూచనల మేరకు ఈ మిషన్లు అందించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌కెపిపి ట్రస్ట్ ఛైర్మన్ సలాదినాయుడు,పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, కవల నానాజీ, ఏసుదాస్, పాలిటెక్నిక్ కళాశాలల సిబ్బంది, ఉపాధి కార్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి..

రామచంద్రపురం మండలం కేంద్రంలో గల భవిత కేంద్రానికి రూ.3 లక్షల విలువైన ఫిజియోథెరపీ పరికరాలను ఇసుజు మోటార్స్ ఇండియా కంపెనీ ప్రతినిధులు అందజేశారు. ఈ పరికరాలను ఇసుజు కంపెనీ ప్రతినిధులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా అందించారు. సత్యం మాట్లాడుతూ ఫిజియోథెరపీ సేవలను అవసరమైన పిల్లలందరూ ఉపయోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఇసుజు మోటార్స్ ఇండియా కంపెనీ ప్రతినిధులు శంకర్ శ్రీనివాస్, ఒనో సుంగ్ (జపాన్) సమగ్ర శిక్ష జిల్లా ఐఇ కోఆర్డినేటర్ ఎంవివి.సత్యనారాయణ, ఎంఇఒలు వీర రాఘవ రెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, ఎంపిడిఒ పద్మజ్యోతి, ఎస్‌కెపిపి ట్రస్ట్ ఛైర్మన్ సలాది నాయుడు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్‌టి సెల్ అధ్యక్షునిగా అభిశక్తుడు

ప్రజాశక్తి -నిడదవోలు

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్‌టి సెల్ అధ్యక్షుడుగా నిడదవోలు పట్టణానికి చెందిన బండి అభిశక్తుడకు పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టికె.విశ్వేశ్వరరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అభిశక్తుడు మాట్లాడారు. పార్టీ తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ అవకాశాన్ని బట్టి, నిబద్ధతతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానన్నారు. మెడవరపు భద్రందొర, చిన్నం మురళీకృష్ణ పాల్గొన్నారు.

జర్మనీలో ఉపాధి కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

యువతకు జర్మనీ దేశంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ నిచ్చి, ఉపాధి కల్పించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి. హరి శేష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ మరియు అత్యంత ఓవర్సీస్ మెన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఐఇఎస్ సంస్థల సహకారంతో జర్మనీ దేశంలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, దీనికి రెండు సంవత్సరాల ఐటిఐ లేదా మూడు సంవత్సరాల ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో ఉత్తీర్ణులై ఉండి, గరిష్ట వయసు 30 సంవత్సరాల లోపు ఉండి, కనీసం రెండేళ్ల అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారి కి నెలకు 2600 - 2700 యూరోలు (అనగా రూ.2.60- రూ.2.70 లక్షలు ఇండియన్ కరెన్సీ) వేతనం ఉంటుందన్నారు. రెండేళ్ల ఒప్పందంపై పని చేయాల్సి ఉంటుందని, అదనపు పనికి అదనపు వేతనం, వసతి, రాక పోకల సౌకర్యాలు యజమాన్యాలు కల్పిస్తామ న్నారు. ఎంపికైన అభ్యర్థులకు రాజమహేం ద్రవరంలో జర్మన్ భాషపై 12 లేదా14 వారాల శిక్షణ ఉంటుందని అన్నారు. రోజుకు ఎనిమిది గంటల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణకు ఫీజు రూ.1.15 లక్షలు కాగా ఫీజ్ ను మూడు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను నవంబర్ 15 లోపు నిర్దేశించిన వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కొరకు 99888 53335, మరియు 91 80991 83854 నెం.లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పర్యాటక కేంద్రంగా రావులపాలెం

ప్రజాశక్తి - రావులపాలెం

త్రీడీలైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు

ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజల సహకారంతో రావులపాలెంను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక కళా వెంకట్రావు సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఐలవ్‌యు రావులపాలెం' కు త్రీడీ లైటింగ్ ప్రత్యేక శోభను తెచ్చిందని ఆయన అన్నారు. గురువారం సాయంత్రం ఎంఎల్ఎ త్రీడీ లైటింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ, చారిత్రాత్మకమైన కళా వెంకట్రావు సెంటర్‌లో ఆధునిక త్రీడీ లైటింగ్ ఏర్పాటు రావులపాలెం అభివృద్ధిలో కొత్త ఒరవడికి నాంది పలికిందన్నారు. దూర ప్రాంతాల నుంచి ఆర్థిక, వ్యాపార కార్యకలాపాల కోసం రావులపాలెంకు అనేక మంది వస్తూ ఉంటారని, ఈ ప్రాంతం ఆతిథ్యానికి ప్రసిద్ధి చెందిందని తెలిపారు. జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికుల దృష్టిని ఈ త్రీడీ లైటింగ్ ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. కాటన్ మహాశయుడి విగ్రహంతో ఏర్పాటు చేసిన కోనసీమ ముఖద్వారం ఆధునికీకరణతో నూతన రూపాన్ని సంతరించుకుందని చెప్పారు. అదే విధంగా కళా వెంకట్రావు విగ్రహాన్ని మరింత ఆధునికీకరించే అవసరం ఉందని, త్వరలో అందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజమహేంద్రవరం వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం, పోలీస్ స్టేషన్ సమీపంలో టాయిలెట్లతో కూడిన విశ్రాంతి భవనం (బస్‌స్టాప్) నిర్మిస్తామని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ప్రకటించారు.అలాగే వాడపల్లి వెంకటేశ్వర స్వామి ముఖద్వారం దాదాపు పూర్తి దశలో ఉందని, త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. దీని ద్వారా రావులపాలెం ప్రాధాన్యత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. రహదారుల ఆధునీకరణలో భాగంగా డివైడర్ల మధ్యలో అలంకార మొక్కలను నాటడం, విద్యుత్ దీపాలతో ప్రకాశవంతమైన వాతావరణం ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో కవి సత్యనారాయణ రెడ్డి, చిలువూరి సతీష్ రాజు, కొప్పిశెట్టి ప్రసాద్, మాసాబత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 3న విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - అమలాపురం

విద్యార్థులలో ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించుకునేందుకు రిలయన్స్ ధీరుభాయ్ అంబానీ క్విజ్ పోటీల ద్వారా ఒక చక్కని వేదికను కల్పిస్తున్నట్లు రిలయన్స్ సిఎస్ఆర్‌హెడ్ పి.సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో క్విజ్ పోటీలు నిర్వహిస్తారన్నారు. డిసెంబర్ మూడో తేదీ బుధవారం స్థానిక అంబే ద్కర్ భవన్ నందు ధీరు భాయ్ అంబానీ క్విజ్ 2025 పోటీలు నిర్వహించేందుకు సన్నాహ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 8, 9, 10 తరగతిలో విద్యార్థిని, విద్యార్థులతో నిర్వహిస్తామన్నారు. పేర్ల నమోదు కొరకు 0884 3577222, 63022 23156లలో సంప్రదించాలని అన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

తాళ్ళరేవు మండలం రంగనాయకపురం తాళ్ళరేవు గ్రామ పంచాయితీ, కాకినాడ జిల్లా గ్రామ కాపురస్తులగు మేడపాటి వెంకటలక్ష్మి, W/o. లోవరాజుకు సంబందించిన పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం **ది. 22-08-2025** తేదిన ఆటోలో వచ్చుచుండగా మార్గం వధ్యలో పడిపోయినది. పాస్‌పోర్ట్ **నెం.V1051400** ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ నందు తెలుపగలరు.

మేడపాటి వెంకటలక్ష్మి
W/o. లోవరాజు
రంగనాయకపురం
తాళ్ళరేవు మండలం, కాకినాడ జిల్లా
సెల్. 9949630246

IN THE COURT OF THE HON'BLE IIND ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM-IX ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT: MEDCHAL
O. S. No: 730 OF 2023

Between:
Polini Venkata Rama Rao ...Plaintiff
AND
Smt. Maddipati Venkata Padmavathi and others ...Defendants

To
1) Smt. Maddipati Venkata Padmavathi W/o Late Srinivasa Rao
2) Maddipati Jyothi Sri D/o Late Srinivasa Rao
3) Maddipati Santhi Sri W/o Late Srinivasa Rao
Above all R/o: East Chodavaram Village, Nallajarla Mandal, East Godavari District-534791, Andhra Pradesh

Please take Notice that the Above named plaintiff has filed the above case against you in O.S. No.730 of 2023 for Recovery of amount against both of you on the file of the Hon'ble IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM IX ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS MEDCHAL MALKAJGIRI DIST AT: MEDCHAL was pleased to ordered on 25-10-2025 in O.S. No. 730 of 2023 for publication the above case is posted on **16-12-2025** and you are hereby called upon to appear in the court on that day at **10.30** AM either in person or through an Advocate. If you failed to attend the Court on that day the case will be disposed as Ex-Party against you.

// BY ORDER OF THE HON BLE COURT//
Sd/- M/s. CHEVURI RAMESH,
Chelluri Gayathri, Advocates & Advocates,
Office Address: H. No. 6-124/1863-1872,
F-No. 307, Sai Parimala Nivas, Opp: Canara Bank, Kakatiya Hills, Pragathi Nagar Main Road, Medchal-Malkajgiri District-500 090 TG.
Cell No. 9849088719.

CHANGE OF NAME

I, undersigned **KOTIPALLI SUBASINI** (old name), W/o. Kotipalli Srinivasa Rao, R/o. D.No.1-448/4, Teachers Colony, Rayudupalem, Ramanayyapeta, Kakinada Rural Mandal, Kakinada District, Andhra Pradesh - 533005. Changing my name from **KOTIPALLI SUBASINI** (old name) to **KOTIPALLI SUHASINI** (new name). Henceforth I am being called as **KOTIPALLI SUHASINI** (new name), W/o. Kotipalli Srinivasa Rao for all purposes.

BEFORE THE HON'BLE IV ADDITIONAL DISTRICT JUDGE: KAKINADA
M.V.O.P.No. 20 of 2025

Between :
Chinnari Venkata Lakshmi & Others ..Petitioners
and
Kurmadasu Subbarao & Others ...Respondents

To,
R1) Kurmadasu Subbarao, S/o. Chinna Sathiraju, aged 32 years, Driver of Lorry Bearing No. ATR 4199, Resident of D.No.1-138, Vengayammapuram Village, Jaggampeta Mandal, Kakinada District, Kakinada Junior Civil Judges's Courts Jurisdiction.
R2) Pinisetti Pullayya Raju Panasatti, S/o. Satyarao, aged 51 years, Owner of the Goods Carriage, Lorry Bearing No.ATR 4199, Resident of D.No.39-8-27, Nallavari Street, Kakinada, Kakinada Junior Civil Judge Court Limits Jurisdiction.

పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్స్ అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా అందుకొనుటలేదు. కావున మీ హాజరు నిమిత్తం **ది. 28-11-2025వ** సంవత్సరం తేదీకి మీకు ఈ నోటీసు పేపరు ప్రకటన ద్వారా కోర్టువారు ఆర్డరు చేసియున్నారు. కావున సదరు తేదీన **ఉదయం గం. 10-30 ని॥లకు** కోర్టువారి ముందు హాజరు అయ్యి మీ ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలియపరచవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

రెడ్డి అన్నవరం, అడ్వకేట్
గొల్లపాలెం, కాజులూరు మండలం,
కాకినాడ జిల్లా., Cell: 9553331888

వేలం ప్రకటన

మహారాజశ్రీ రాజమండ్రి 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 66/2024
O.S. No. 280/2013

Between:
లావేటి రాజు ...DHr
AND
చుక్కల నూకరాజు, W/o. (లేటు) అప్పారావు, హిందూ, వయస్సు 72 సం॥లు, డో.నెం. 45-14-15, రామాలయం వీధి, తాడితోట, రాజమండ్రి, తూ॥గో॥జిల్లా ...JDr

పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి సమక్షంలో **ది. 03-12-2025వ** తేదీన **ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితు బహిరంగ వేలం జరుగును. కావలసిన వారు వచ్చి పాడుకొనవచ్చును. పాట షరతులు కోర్టు నజారత్ గారిని అడిగి తెలుసుకొనవచ్చును.

వేలం ఆస్తి వివరములు

తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి సబు రిజిస్ట్రర్‌లో చేరిన గోరక్షణపేట, సిమెంటరీ పేట, ఆంధ్రా నగర్‌లో గల 150 చ॥గ॥ విస్తీర్ణంలో డోర్ నెం. 45-14-15కు హద్దులు. **తూర్పు:** ప్లాట్ నెం.540, **దక్షిణం:** ప్లాట్‌నెం. 532, **పడమర:** 25 అ॥ రోడ్డు. **ఉత్తరం:** ప్లాట్ నెం.30

DHr విలువ : రూ. 40,00,000/-
అమీనా విలువ: రూ. 60,00,000/-
మార్కెట్ విలువ: రూ. 53,11,500/-
JDr విలువ: ఇవ్వలేదు

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
బి.నాగశేషు
రాజమండ్రి — అడ్వకేట్, రాజమండ్రి
06-11-25 — సెల్:9397919008